క్లుప్తంగా

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు

- ఎస్పీ విజయారావు
- రంగడి దేవస్థానంలో వైకుంఠ ఏకాదశి ఏర్పాట్ల పరిశీలన



బందోబస్తు ఏర్పాట్లపై మాట్లాడుతున్న విజయారావు

నెల్లూరు(క్రైమ్): వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానానికి విచ్చేసే భక్తులకు ఎలాంటి ఇక్కట్లు తలెత్తకుండా చూడాలని ఎస్పీ విజయారావు సూచించారు. రంగనాథస్వామి దేవస్థానం వద్ద బందోబస్తు ఏర్పాట్లు, ట్రాఫిక్, పార్కింగ్ పాయింట్లు, బ్యారికేడ్లను ఆదివారం పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. 500 మందితో పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని వివరించారు. సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వర్తిస్తూ భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. నిర్దేశిత ప్రాంతాల్లోనే వాహనాలను నిలిపేలా చూడాలన్నారు. అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై నిఘా ఉంచడంతో పాటు క్రైమ్ పార్టీలు మఫ్టీలో తిరుగుతూ చోరీలు జరగకుండా చూడాలని చెప్పారు. పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఏఎస్పీ హిమవతి, నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, నగర ఇన్‌స్పెక్టర్లు అన్వర్‌బాషా, సురేంద్రబాబు, సుబ్బారావు, నరసింహరావు, రాములునాయక్, సీతారామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



ఆత్మకూరు: పట్టణంలోని జ్యోతినగర్‌లో అంబేడ్కర్ ఇండియా మిషన్ ఆదివారం క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎం డివిజన్ కన్వీనర్ పట్టెడ మురళీ మాట్లాడుతూ ఏఐఎం వ్యవస్థాపకుడు పీవీ సునీల్‌కుమార్ డీజీపీగా బాధ్యతలు చేపట్టబోతున్న క్రమంలో శౌర్య దినోత్సవం నిర్వహించినట్లు తెలిపారు. అందులో భాగంగా క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు వివరించారు. ఏఐఎం కార్యవర్గ సభ్యుడు కే సురేష్, పెంచలస్వామి, యానాదయ్య, మల్లికార్జున, కొండయ్య, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

కళల్లో ప్రావీణ్యం సాధించాలి



ఆత్మకూరు: చిన్నారులు కళల్లో ప్రావీణ్యం సాధించాలని శృంగేరి శారదా పీఠం ఆస్థాన జ్యోతిష్య పండితురాలు జే స్రవంతి అన్నారు. పట్టణంలోని నారాయణరావుపేటలోని శ్రీభారతి సంగీత నృత్య విద్యాలయంలో ఇటీవల నిర్వహించిన సంగీత, నృత్య పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు ఆదివారం బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శ్రీభారతి సంగీత నృత్యా విద్యాలయం నిర్వాహకులు వెనుకబడిన ఆత్మకూరు ప్రాంతంలోని చిన్నారులకు సంగీత, నృత్య కళల్లో శిక్షణ ఇచ్చి, వారిని జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొనేలా చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకురాలు కే అపర్ణ, శిక్షకురాలు ఉమా మహేశ్వరి, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్‌పేట దర్గాలో భక్తుల సందడి



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని హజరత్ నాయబ్ రసూల్ దర్గాలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. నూతన సంవత్సరం సందర్భంగా దర్గాను దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. దర్గా పీఠాధిపతి హాఫీజ్‌పాషా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు ఆశీర్వచనాలు అందజేశారు.

నూతన సంవత్సరాదికి ఘన స్వాగతం

నెల్లూరు(పొగతోట): నూతన సంవత్సరాదికి నగర ప్రజలు ఘన స్వాగతం పలికారు. కేక్‌లను కట్ చేసి సంబరాలు జరుపుకొన్నారు. వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు.

- నగరంలోని జెడ్పీ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. జెడ్పీ సీఈఓ చిరంజీవి కేక్‌ను కట్ చేసి అధికారులు, ఉద్యోగులు, సిబ్బందికి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. అసోసియేషన్ నేతలు పెంచలయ్య, రమేష్‌బాబు, ఏఓలు కొండయ్య, షాలెట్, వాసు, శైలజ, విజయరాణి, నాలుగో తరగతి సంఘ నేతలు భీమ్‌రెడ్డి, మాబాషా, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): కలెక్టర్ చక్రధర్‌బాబుకు నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో పలువురు ఉద్యోగులు, అధికారులు నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఏపీ రెవెన్యూ సర్వీసెస్ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ క్యాలెండర్లను ఆవిష్కరించి శుభాకాంక్షలను తెలిపారు. వివిధ అనాథాశ్రమాలకు పంపిణీ చేసేందుకు గానూ దుప్పట్లను కలెక్టర్‌కు చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో అందజేశారు. ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు బొకేలను అందజేసి సత్కరించారు. షఫీమాలిక్, చేనేత జౌళి శాఖ ఏడీ ఆనంద్‌కుమార్, ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు పెంచలరెడ్డి, నేతలు డానియెల్ పీటర్, బాలకోటమ్మ, ఎన్జీఓ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పెంచలరావు, కార్యదర్శి నాయుడు వెంకటస్వామి, అసోసియేట్ అధ్యక్షుడు ఆంజనేయవర్మ, వెంకటేశ్వర్లు, మహిళా చైర్‌పర్సన్ చిన్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

- దర్గామిట్టలోని ఏపీ ఎన్జీఓ భవన్‌లో ఎన్జీఓ అసోసియేషన్, బధిర ఉద్యోగుల సంఘ క్యాలెండర్లను ఆవిష్కరించారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు పెంచలరావు, నాయుడు వెంకటస్వామి, మాధవరెడ్డి, గిరి, మస్తానయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(క్రైమ్): ఎస్పీ విజయారావును నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాలను అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఏఎస్పీలు హిమవతి, శ్రీనివాసరావు, ఎస్ఈడీ జేడీ శ్రీలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చక్రధర్‌బాబు

- ఎస్పీ విజయారావును వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు.

నెల్లూరు (టౌన్): ఏపీటీఎఫ్ – 1938 డైరీ, క్యాలెండర్లను రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ రామలింగం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానాలకు అనుగుణంగా బోధించి ఉత్తమ ఫలితాలను రాబట్టాలని కోరారు. ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర బాధ్యుడు జుల్ఫీకర్ అలీ, భాస్కర్‌రెడ్డి, ఆరిఫుల్లా, జిల్లా బాధ్యుడు వెంకటేశ్వర్లు, మురళీకృష్ణ, ఖాదర్‌బాషా, రామసుబ్బారెడ్డి, గురవయ్య, రోశయ్య, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి బ్యాంక్ సీఈఓ శంకర్‌బాబుతో పాటు పలువురు అధికారులు శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

- సంతపేటలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో కేక్‌ను కట్ చేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సిరాజ్, నేతలు రామరాజు, షానవాజ్, ఏఐవైఎఫ్ నేతలు మున్నా, గౌస్, సర్దార్, గయాజ్, ముత్యాలు, తదితరులు పాల్గొన్నారు.
- కలెక్టర్ చక్రధర్‌బాబుకు నూర్‌బాషా సంఘ జిల్లా నేతలు శుభాకాంక్షలను తెలియజేశారు. నూర్‌బాషా జిల్లా నేతలు సలీమ్, మహబూబ్‌బాషా, మస్తాన్ సాహెబ్, మస్తాన్‌వలీ, ఖాసిం, తదితరులు పాల్గొన్నారు.
- సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్ర సుభిక్షంగా ఉందని, ప్రజలెంతో సంతోషంగా ఉన్నారని నెల్లూరు జిల్లా బార్ అసోసియేషన్ మాజీ సెక్రటరీ రోజారెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లోని రోజారెడ్డి నివాసం వద్ద నూతన సంవత్సర వేడుకలను వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డికి శుభాకాంక్షలను తెలియజేశారు. న్యాయవాదులు సిరి, కనకాద్రి, సుబ్బారెడ్డి, చంద్రశేఖర్‌నాయుడు, రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(బృందావనం): గాంధీబొమ్మ సమీపంలోని అమరావతి చాంబర్స్‌లో నూతన సంవత్సర వేడుకలను 25 కళాసంఘాల కన్వీనర్లు హరిబాబు, హరనాథ్‌రెడ్డి, అమీర్‌జాన్, భాస్కర్, రత్నం, రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి కేక్‌ను కట్ చేశారు. అనంతరం ఆయన్ను సత్కరించారు.

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేశారు. వాకర్స్‌కు మిఠాయిలు, గుడ్లను పంపిణీ చేసి.. వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు తిరుపతినాయుడు, శేషగిరిరావు, రంగారావు, రమణయ్యగౌడ్, బలరామయ్యనాయుడు, నరసింహారెడ్డి, వెంకటేశ్వర్లుగౌడ్, వైద్యులు కృష్ణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



25 కళాసంఘాల ఆధ్వర్యంలో..



ఎస్పీకి పుష్పగుచ్ఛమిస్తున్న గిరిధర్‌రెడ్డి



ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో..



డైరీ, క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న రామలింగం



సీపీఐ కార్యాలయంలో..



డీసీసీబీ చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది



జెడ్పీ కార్యాలయంలో..



ఎన్జీఓ క్యాలెండర్ల ఆవిష్కరణ

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



రంగనాథుడి దేవస్థానంలో భక్తులు



నరసింహకొండలో..



రాజరాజేశ్వరి ఆలయంలో చక్రధర్‌బాబు

నెల్లూరు(బృందావనం): నూతన సంవత్సరాదిని పురస్కరించుకొని నగరంలోని పలు ఆలయాల్లో విశేష పూజలను ఆదివారం నిర్వహించారు. తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు.

- నగరంలోని రాజరాజేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి పూజలు చేశారు. అమ్మవారు, మూలవర్లు, అనివెట్టి మండపాన్ని పుష్పాలతో అలంకరించారు. ఉభయకర్తలుగా సుబ్రహ్మణ్యం, నరసింహులు, మురళి, చిన్నా, నిశాంత్, నితీష్‌కుమార్ వ్యవహరించారు. బాలాత్రిపురసుందరి నృత్యనికేతన్ కామాక్షి శిష్యబృందం ప్రదర్శించిన కూచిపూడి, భరతనాట్యాలు అలరించాయి. అమ్మవారిని కలెక్టర్ చక్రధర్‌బాబు దర్శించుకున్నారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త రత్నం జయరామ్, ఈఓ గిరికృష్ణ, ఆహ్వాన కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్ పర్యవేక్షించారు.

నెల్లూరు రూరల్: నరసింహకొండపై కొలువైన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు, అభిషేకాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

సాయినాథుడికి విశేషాభిషేకాలు

నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ శివారు పద్మావతినగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో నూతన సంవత్సర వేడుకలను నిర్వహించారు. మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసూదన్‌సాయి ఆధ్వర్యంలో ప్రత్యేకాభిషేకాలు చేశారు. మందిరంలో కొలువైన సాయినాథుడ్ని పుష్పాలు, బెలూన్లతో నేత్రపర్వంగా అలంకరించారు. సాయినాథుడి చిత్రంతో ఉన్న క్యాలెండర్, పాకెట్ ఫొటోను ఆవిష్కరించారు. సుమారు వెయ్యి మందికిపైగా భక్తులకు అన్నప్రసాదాన్ని అందజేశారు. మందిర గౌరవ సలహాదారు రామసుబ్బయ్య, బాబీసాయి, తదితరులు పాల్గొన్నారు.



విశేషాలంకారంలో సాయినాథుడు



హాజరైన భక్తులు

ఎమ్మెల్యే అనిల్‌కు శుభాకాంక్షలు



సత్కరిస్తున్న నేతలు



ఎమ్మెల్యేను కలిసిన హరిత

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్‌కు పలువురు శుభాకాంక్షలను తెలియజేశారు. ఇస్కాన్ సిటీలోని ఆయన నివాసం, రాజన్న భవన్‌లో పలువురు మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను కమిషనర్ హరిత దంపతులు, డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, తదితరులు సత్కరించారు. అనంతరం విద్యార్థులకు ఉపయోగపడేలా పెన్నులు, నోట్ పుస్తకాలను పలువురు అందజేశారు.

పలువురికి సన్మానం



నెల్లూరు(బృందావనం): మూలాపేటలోని అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో వీఆర్ కళాశాల విశ్రాంత ఆంధ్రభాషాచార్యుడు వెంకటస్వామిరెడ్డి, సమాజ అధ్యక్షుడు పెంచలయ్యను ఆదివారం సత్కరించారు. ఆంజనేయులు అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సంఘమిత్ర విద్యాసంస్థల నిర్వాహకుడు రవీంద్రరెడ్డి, స్వచ్ఛంద సంఘ సేవకుడు సుకుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మహిళపై దాడి



నెల్లూరు(క్రైమ్): విభేదాల నేపథ్యంలో మహిళపై ఓ వ్యక్తి కత్తితో దాడి చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. వెంకటేశ్వరపురంలోని భగత్‌సింగ్ కాలనీలో కామాక్షి కుటుంబం నివాసం ఉంటోంది. అదే ప్రాంతానికి చెందిన మున్నీ ఆమెకు నగదును అప్పుగా ఇప్పించారు. అప్పు తిరిగి చెల్లించడంలేదనే కారణంతో వీరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో బాబు ఐస్‌క్రీమ్స్ సమీపంలో మున్నీ నడిచి వెళ్తుండగా, కామాక్షి భర్త రాము గొడవపడి కత్తితో దాడి చేశారు. ఘటనలో మున్నీ తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు స్థానికులు తరలించారు. ఘటనపై సంతపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. నిందితుడు రామును అదుపులోకి తీసుకొని విచారణ జరుపుతున్నామని ఇన్‌స్పెక్టర్ అన్వర్‌బాషా తెలిపారు.

పింఛన్ సంబరాలు



పింఛన్‌ను అందజేస్తున్న గిరిధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: నూతన సంవత్సర కానుకగా ప్రభుత్వం పెంచిన పింఛన్ మొత్తాన్ని లబ్ధిదారులకు ఆదివారం అందజేశారు. పింఛన్ పెంపు వారోత్సవాలను పురస్కరించుకొని 20వ డివిజన్లో పింఛన్లను మేయర్ స్రవంతితో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అందజేశారు. నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో గిరిధర్‌రెడ్డి మాట్లాడారు. అర్హులందరికీ పింఛన్లు అందుతాయని, ఈ విషయంలో ఆందోళన అక్కర్లేదని చెప్పారు. కార్పొరేటర్ మహేష్, తదితరులు పాల్గొన్నారు.

- దేవరపాళెంలో నిర్వహించిన కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, పార్టీ రూరల్ మండల కన్వీనర్ శ్రీనివాసులురెడ్డి, నరసింహకొండ దేవస్థాన చైర్మన్ సురేంద్రరెడ్డి, సర్పంచ్ అశోక్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లాబక్షు పాల్గొన్నారు.

ఘన సన్మానం

నెల్లూరు(బృందావనం): కళారంగానికి విశిష్ట సేవలందిస్తున్న కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు సుబ్బారావును 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి ఆదివారం సత్కరించారు. కళాకారుల సంక్షేమం కోసం చేపడుతున్న కార్యక్రమాలను కొనియాడారు.

దుస్తుల వితరణ

కొడవలూరు: నూతన ఆంగ్ల సంవత్సరం సందర్భంగా మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న సెంటినరీ బాప్టిస్టు చర్చిలో చర్చి సభ్యులు పాటూరు రమేష్, రవి వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం ఆదివారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. 200 మందికి చీరలు, పంచలు, చొక్కాలు పంపిణీ చేశారు. తొలుత ఎంపీపీ గాలి జ్యోతి చర్చి సభ్యులందరికీ కేక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ డాక్టర్ ఎం.ప్రేమ్‌నాథ్, అధ్యక్షుడు బి.సుదర్శనం, సర్పంచ్ సుప్రియ, సభ్యులు జి.సునీల్, అహరోన్ పాల్గొన్నారు.

విద్యతో ఉన్నత శిఖరాలకు

- కలెక్టర్ చక్రధర్‌బాబు



నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యతో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని కలెక్టర్ చక్రధర్‌బాబు పేర్కొన్నారు. నగరంలోని వాత్సల్య అనాథ శరణాలయాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ఉన్నత పాఠశాల, వంటశాల, వసతిగృహాన్ని పరిశీలించారు. విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. అమ్మఒడి పథకం 64 మందికి రావాల్సి ఉందని విద్యార్థులు తెలియజేశారు. వెంటనే మంజూరయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.